

# అమెరి 'కాకమ్మ' కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



## మరికొన్ని కాలక్షేపం కహానీలు

### *అమెరికాకమ్మ కథలు- 24*

**మొన్న రోబో సినిమా చూసి ఇంటికి వస్తూ ఉంటే,** కారులో కూచోగానే "బాగానే ఉంది" అంది మా క్వీన్ విక్టోరియా.

"అవును, రజనీ కాంత్ బాగా నటించాడు, మ్యూజిక్ పరవాలేదు. ఐశ్వర్యా రాయ్ గురించి చెప్పక్కర లేదు కదా!"అన్నాను ఆవిడ మాట రకీమని ఒప్పేసుకుంటూ. నిజానికి నాకు ఆ సినిమా అంటే ఒళ్ళుమండుతుంది.

దానికి కారణం ఆ సినిమా బాగా లేక కాదు. ఒక ఊళ్ళో మేము మా విరాళాల వేటలో ఒక ఊళ్ళో మా ఘంటసాల ఆరాధనోత్సవాల 18 వ కార్యక్రమం పెట్టిన నాడే ఈ రోబో రిలీజ్ అయింది మా ప్రాణాలకి. తెలుగు జనాభా అందరూ వెధవ సినిమాకి పోయి దాన్ని విజయవంతం చెయ్యగా, ఆ ఊరి తెలుగు సంఘం ప్రెసిడెంటూ, మైకుల వాడూ మాత్రం మా ప్రోగ్రాంకి వచ్చి విజయవంతం చెయ్యడానికి విశ్వ ప్రయత్నం చేశారు. అమెరికాలో వారాంతంలో కొత్త సినిమా రిలీజు నాడు వచ్చే పండగలు కూడా పోస్ట్ పోన్ చేసుకునే సాంప్రదాయం ఉంది కదా! అది మర్చిపోయిన ప్రెసిడెంటూ, రోబో సినిమాల మీదా నాకు భలే "ఇది"గా ఉంది.

అంతియునే కాక, ఈ వయసులో మా మహారాణితో సినిమాల విషయంలోనూ, అనేక ఇతర విషయాలలోనూ విభేదించకుండా, అనాలోచితంగా ఒప్పేసుకోవడం నా ఆరోగ్య సూత్రాలలో మొట్ట మొదటి అయితే, టైముకి మందూ, మాకూ వేసుకోవడం రెండో సూత్రం. ఇక్కడ మందు అనగా సుగరూ, బీపీ మొదలైన వాటికి వాడే అసలైన మందులని అర్థం చేసుకోవాలి కానీ, విస్కీలూ, బీరులూ అని అపార్థం చేసుకోకూడదని మనవి. ఇక మాకు అనే తెలుగు మాటకి నాకూ, మీకూ, ఎవరికీ కూడా అర్థం తెలియదని నాకున్న అభిప్రాయం. "మాకు" అంటే మొక్కలూ, చెట్లూ మొదలైన వాటి నుంచి తయారు చేసే లేహ్యాలూ, ద్రావకాలోయ్ అని ఎవరు చెప్పినా నా అభిప్రాయం మారదు.

"అదిగే, అదే నీతో వచ్చిన చికాకు. రోబో సినిమా బావుంది అని ఎవరన్నారూ, హన్నా?" అని కసిరింది మహాతల్లి.

"మరి ఇంకేమిటి బావుంది" అన్నాను ఎక్కడా క్లూ అందక.

"అదే, క్రిందటి నెల నీ సొంత పైత్యం లేకుండా కాపీ జోకులతో నువ్వు కౌముదిలో రాసిన ఆర్టికిల్" ఆవిడ ఉవాచ.

అదిగో, అదే, మా క్వీన్ విక్టోరియాకీ, ఇతరుల మహారాణీలకీ తేడా.

మామూలు వాళ్ళయితే సినిమా నుంచి బయటకి వచ్చాక, సినిమా గురించి మాట్లాడుకుంటారు. కానీ, ఆవిడ మామూలు ఆ-విడ కాదుగా! నాకున్న మేధాశక్తినంతా వాడేసినా, బుర్ర వేడెక్కుతుంది కానీ, ఆవిడ నెల్లాళ్ళ క్రితం వచ్చిన నా ఆర్టికల్ మీద తన అమూల్యమైన అభిప్రాయం రోబో సినిమా వీక్షణానంతర క్షణాలలో ప్రస్తావించునని ఊహించనైతి.

అటువంటివే మరికొన్ని ఉదాహరణలు వంట చేస్తూ పోపు సామాను గురించి కాకుండా జగన్ వేరు కుంపటి పెట్టుటా, మొక్కలకి నీళ్ళు పోస్తూ అమెరికాలో కొత్తగా వెలిసిన "నాటా" సంఘం గురించి తన అభిప్రాయం తెలుపుటా, ఇండియాలో మా మామగారితో మాట్లాడుతూ నా గురించి అప్రస్తుత ప్రసంగం చేయుటా మొదలైనవి.

కానీ, ఆవిడ ఉవాచ విని "అవునేమో సుమా" అనిపించి ఈ సారి కూడా అదే పంథా అనుసరించదల్చుకున్నాను. అనగా కాపీ జోకులతో అలరించదల్చుకున్నాను. తేడా అల్లా, ఈ సారి జోకులన్నీ నేను గత రెండు నెలలగా 30 నగరాలలో స్టేజ్ మీద చెప్పినవే. ఈ జోకులకి ఇంచుమించు అన్ని చోట్లా జనం హాయిగా నవ్వారు. కొన్ని చోట్ల నవ్వుకున్నారు. పైగా, కొన్ని జోకులు చదివి నవ్వుకోడానికి బావుంటాయి కానీ, "నుంచునే హాస్యం" లేదా "నిలబడే హాస్యం" అనగా స్టేండ్ అప్ కామెడీ లో ప్రేక్షకుల సమక్షంలో నా మొహంలా వచ్చే అవకాశం ఉంది. మరికొన్ని, చదివితే నా మొహం వలెనూ, బాగా చెప్ప గలిగితే నచ్చే విధంగానూ ఉంటాయి. ఎటునుంచి నరుక్కొచ్చినా, స్టేజ్ మీద హాస్యం చేసేటప్పుడు, ఎప్పుడు, ఏది, ఎలా "పేలుతుందో" చెప్పలేం కదా! ఎప్పుడు పేల్తాయో, ఎప్పుడు తుస్సు మంటాయో చెప్పలేని, నేను స్టేజ్ మీద చెప్పే జోకులు నా దగ్గర చెప్పలేనన్ని ఉన్నాయి.

ఉదాహరణకి, నేను మొన్న ఏదో చలి, చలిగా, గిలి గిలిగా ఉండే ఒక అమెరికా ఊరు వెళ్ళగానే ఒంట్లో నా మొహంలా ఉంది. వెంటనే ఊళ్ళో తెలుగు డాక్టర్లు ఎవరైనా ఉన్నారా అని వాకబు చేసి ఒకాయన దగ్గరకి వెళ్ళాను. ఆయన ఏవో చిన్న, చిన్న పరీక్షలు చేసి రెండు మాత్రలు ఇచ్చి "రాజు గారూ, ఒక మాత్ర రాత్రి పడుకునేముందు వేసుకోండి, పొద్దున్న లేస్తే రెండోది వేసుకోండి" అన్నాడు.

అదేమిట్రా బాబోయ్ అలా అన్నాడు అనుకుని, పొద్దున్న లేచాను కాబట్టి మరొక డాక్టరు దగ్గరకి వెళ్ళాను, ఎందుకైనా మంచిదని.

ఆయన పెద్ద, పెద్ద పరీక్షలు చేసి, "రాజు గారూ, రేపొద్దున్నే వచ్చెయ్యండి. మీకు ఆపరేషన్ చెయ్యాలి" అన్నాడు అదేదో "బ్రేక్ ఫాస్ట్‌కి రండి, ఇడ్లీలు పెడతాను" అన్నట్టుగా.

ఇదెక్కడి గోలరా అనుకుంటూ, ఇక తప్పదు కదా అని మర్నాడు హాస్పిటల్‌కి వెళ్ళగానే, నేను వేసుకున్న బట్టలన్నీ విప్పి పారేసి, కాగితం గౌను వేసి బల్ల మీద పడుకోబెట్టగానే హడిలి చచ్చిపోయాను.

కుర్ర డాక్టరు కూడా మరొక రంగు కాగితం గౌనే వేసుకుని లోపలికి వచ్చి, కత్తి నూరుకుంటూ నన్ను చూసి "ఏమిటి, రాజు గారూ, అలా ఒణికిపోతున్నారూ?" అన్నాడు.

"ఏం చెప్పమంటారు డాక్టరు గారూ, నా జన్మలో ఇప్పటి దాకా నాఒంటి మీద కత్తి పడలేదు. నాకు భలే భయంగా ఉంది" అన్నాను.

"భలే వారే! నాక్కూడా ఇదే కదా మొట్టమొదటి ఆపరేషనేగా, చూడండి నేను ఎంత ధైర్యంగా ఉన్నానో" అన్నాడు పళ్ళికిలిస్తూ.

ఈ లోగా ఒక చిన్న నర్సు పెద్ద బంతి పూల దండ పట్టుకుని ఆపరేషన్ రూములోకి వచ్చింది. అది చూడగానే నా పై ప్రాణాలు పైనే పోయాయి.

"అమ్మా, అదేమిటీ దండ పట్టుకొచ్చావూ?" అని అడిగాను.

" ఏం లేదు. ఆపరేషన్ సక్సెస్ అయితే డాక్టరు గారికీ, అవకపోతే, నీకూ వేద్దామనీ" అంది నర్సు.

ఈ పై జోకు చాలా చోట్ల బాగానే "పేలింది". ఎటొచ్చీ ప్రోగ్రాం అయిపోగానే ఒకాయన నా దగ్గరకి వచ్చి "ఇప్పుడు మీ ఒంట్లో ఎలా ఉంది సార్. నేను బాగా ప్రాక్టీస్ ఉన్న డాక్టర్నే" అని పరిచయం చేసుకున్నాడు. నా స్టేండ్ అప్ కామెడీ ఆయనకి ట్రాజెడీలా అనిపించిందో ఏమో!

తరవాత మరో ఊరు వెళ్ళినప్పుడు బాగా "పేలిన" మరొక జోకు:

"నేనూ, మా క్వీన్ విక్టోరియా ఒకసారి ఎక్కడికో వెళ్తుంటే , సీవీయస్ ఫార్మసీ బోర్డు కనపడగానే "ఆపు, కారు ఆపు" అని ఆవిడ గోల పెట్టింది. కారు ఆగగానే ఆవిడ లోపలికి వెళ్ళి, అక్కడి ఫార్మసిస్ట్‌తో గాభరాగా "మీ దగ్గర ఎక్కిళ్ళకి మందు ఉందా" అని అడిగింది.

పెద్దాయన అవిడని ఒక సారి చూసి చెంప మీద లాగి లెంపకాయ కొట్టాడు.

"అదేమిటీ ఎక్కిళ్ళకి మందు అడిగితే కొడతావేం" అంది మా క్వీన్ బుగ్గలు తడుముకుంటూ.

"చూశారా, ఇప్పుడు మీ ఎక్కిళ్ళు తగ్గిపోయాయి కదా" అన్నాడు ఫార్మసిస్ట్ విజయగర్వంతో.

"ఏడిశావు. ఎక్కిళ్ళు నాకు కాదు, బయట కారులో కూచున్న మా ఆయనకి అని మా ఆవిడ గబగబా కారులోకి వచ్చి నన్ను లాగి లెంపకాయ కొట్టింది".

ఇది వినగానే ఒకావిడ పరిగెట్టుకుని నా దగ్గరకి వచ్చి, "ఆవిడ మిమ్మల్ని లెంప కాయ కొడితే మటుకు, అలాగ పబ్లిగ్గా చెబుతారేమిటీ? మీ ఫేమిలీ ప్రెస్టేజ్ బజార్న పడిపోలేదూ?" అని క్లాస్ పీకింది. అంటే ఈ జోకు బావుందన్న మాట.

అంత కాకపోయినా, కొంచెం పేలిన పాత కాలం జోకు మరొకటి:

"నేను ఒకసారి ఒక కర్నాటక సంగీత కచేరీకి వెళ్ళాను. విద్వాంసుడు గారు బాగా పాడుతున్నాడు. వయొలిన్ ఆయనా బాగానే వాయిస్తున్నాడు. కానీ, వీళ్ళిద్దరికంటే ఎక్కువ తన్మయత్వంతో, కళ్ళు మూసుకుని మృదంగం వాయించే అయన తన ప్రతిభని ప్రదర్శిస్తున్నాడు. ఆఖర్న మంగళం పాడేసిన తరవాత కూడా, ఆయన అలాగే కళ్ళు మూసుకుని ఎడా, పెడా మద్దెల వాయిస్తూ ఉంటే, నాకు ఆశ్చర్యమూ, ఆనందమూ వేసి "కంగ్రాట్యులేషన్స్" చెబ్దామని స్టేజ్ దగ్గరకి వెళ్ళి మద్దెల చూశాను. దానికి ఒక వేపున ఆయన భార్య బొమ్మా, రెండో వేపున ఆయన అత్తగారి బొమ్మా ఉన్నాయి". ఈ జోకు చదవడం కంటే, స్టేజ్ మీద బాగా చెప్పగలిగితే బావుంటుంది.

అన్నట్టు, ఈ డిశంబర్ 4, 2010 నాడు, అమెరికాలో ప్రప్రథమంగా, 12 గంటల సేపు నిర్విరామంగా ఆయన పాటలతో ఘంటసాల గారి 88 వ పుట్టిన రోజు అత్యంత ఘనంగా మా హ్యూస్టన్ లో జరుపుతున్నాం. అమెరికాలో అనేక నగరాల నుంచి సుమారు నలభై మంది గాయనీ, గాయకులు ఆయన పాడిన పాటలూ, ఆయన సంగీతం సమకూర్చిన పాటలూ పాడుతున్నారు. ఘంటసాల గారి ఫొటో ఎక్జిబిషనూ, వీడియో ప్రదర్శనా, ఆయన ప్రసంగాలూ మొదలైన వాటితో జరిగే ఈ బృహత్తర కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

"సరేలే! ప్రోగ్రాం నాడు నువ్వు ఏమైనా జోకులు చెప్పావంటే?" అంది మా క్వీన్ విక్టోరియా, తన చూపుడు వేలు తీవ్రంగా ఆడిస్తూ. ఆ భంగిమ అర్థం తెలుసుకుని, ఆ విధముగానే ప్రవర్తించుట నా ఆరోగ్య సూత్రాలలో మూడవది.

***

**NEW**
Click here to share your comments on this article